# తస్మాత్ జాగ్రత్త

బి.వి.రమణారావు

అక్షరాభ్యాసమైన మరుక్షణంనుంచీ రచనాభ్యాసం పరిపాటయిన ఈరోజుల్లో విసుగులేకుండా రాసేస్తున్నారన్నా, ఊపిరాడకుండా ప్రింటు చేస్తున్నారన్నా, ఎడతెరిపిలేకుండా చదివేస్తున్నారన్నా ఆశ్చర్యమేముంది! ధరలెలా మండిపోతున్నా సరుకు దొరికితే చాలనుకుని ఈకరువు రోజుల్లో పుష్కలంగా దొరికే సరుకు సాహిత్యమొక్కటే.

కాని వొచ్చిన పేచీ ఏమిటంటే అన్ని సరుకులతో పాటూ ఈ సాహిత్యంలో కూడా కల్తీ జొరబడింది. ఈ కల్తీ సాహిత్య ప్రభావంవల్ల మానసిక కాలుష్యం అనివార్యమని ఈనాటి సాంఘిక వ్యవస్థ రుజువుచేసింది. మనం రాసేది నిజమా అబద్ధమా, దీన్ని చదివి జనం బాగుపడతారా పాడవుతారా అన్న వితరణలేకుండా భారియెత్తున జరుగుతున్న ఈ రచనా పరిశ్రమతాలూకు విషవాయుప్రసారం నిర్విరామంగా నిరాఘాటంగా సాగిపోతుంది. ఏవార్త, ఏకథ, ఏకవిత, ఏనవల ఏ నాటకం పరిశీలించినా మనకి బోధపడేదేమిటంటే ప్రతి మొగాడూ ఓ దానవుడు, ప్రతి ఆడది ఓ దేవత అని. ప్రతి భర్తా భార్యనికోసి రంపాన పెడుతున్నాడనీ, వొంటరిగావున్న ప్రతి ఆడదానికీ మానభంగం తప్పదని. మొగాడి ఖాగ్దా వాలకీ దుర్మార్గాలకీ ఆహుతై నిత్యం ప్రతిచోటా ఒకరో యిద్దరో ఆడాళ్ళు ఆత్మహత్యలు చేసుకుంటున్నారనీ మనకి భయభ్రాంతులు కలగడం సహజం.

పత్రికల్లోపడే మానభంగం కేసులు అబద్ధమనటంలేదు. ఆడదానికి అమోఘమైన ఆయుధం నోరు. రేప్ చేసేముందో, చేస్తుంటేనో, చేసేసేకో గందరగోళం చేస్తుంది. అంచేత ఆ వార్త బహుళ ప్రచారంపొందుతుంది. తద్వారా ఆడదానికి బోలెడు సానుభూతి లభిస్తుంది. ఆడదాని చేతిలో మొగాడు ఎటువంటి అవమానాలు పొందినా నిశ్శబ్దంగా భరించడానికి అలవాటుపడ్డాడు అంచేత వాడిగోడువినేవాడెవడూలేడు నిజానికి నూటికి తొంభయితొమ్మిది సంసారాల్లో ఆడదానిదే పైచెయ్యి. మిగిలిన ఒక్కశాతం సంసారాల్లో ఈనాటి సాహిత్యంలో కథావస్తువులు. ప్రతి రచయితా(త్రీ) తనకి అనుభవంలేని విషయాల్ని ఊహించి రాయడానికి పూనుకోడమే ఈ అనర్థానికి మూలం.

పెళ్ళవ్వగానే సిగరెట్లు, తాగుడు, పేకాట మానేసినవాళ్ళెంతమందిలేరు! ఆచారి, నరసింహం, గద్దె, సురేంద్ర, అగ్రవాల్, పీటర్ మొదలయిన అసంఖ్యాకులెందరో భార్యల కబంధహస్తాల్లో యిరుక్కుని జీవితంలో వెలుగుని స్వతంత్రాన్ని పోగొట్టుకున్న ఒకనాటి వీరులుగా మిగిలిపోయేరు.

పాపం! నరసింహం తప్పుకుంటే చాలేసుంది వాళ్ళావిడ బంధువు పెళ్ళికని విజయవాడెళ్ళిందట. అంతే ఆవురు ఆవురుమంటూ మాతో చేరి మందు కొట్టి రెండున్నర బేంకులు జేబులో పెట్టుకుని మళ్ళీ ఇలాంటి అదృష్టం ఎప్పటికో! అంటూ కంటతడిపెట్టి అదృశ్యమయ్యేడు వాడు చెప్పిన విషయాలు వింటుంటే కడుపు తరుక్కుపోతుంది. మొగాళ్ళు చదువుకోడానికో ప్రత్యేకమైన పత్రికుంటే ఈ పెళ్ళనే నరకకూపంలో పడకుండా మొగాళ్ళని హెచ్చరించడానికి వాడి దాంపత్య జీవిత చరిత్రని ఒకసందేశంగా ప్రచురించవొచ్చు.

నువ్వెందుకు పెళ్ళాడ్డంలేదు అని అడిగితే ఆడదాని డామినేషన్‌కి భయపడి అని చెప్పలేను కదా! నాకు పెళ్ళి యిష్టంలేదూ అంటే నాకు మగసిరిలోపమేమో అనుకుంటారు. ఆ కళ్యాణం ఘడియొచ్చేటప్పటి అలాంటి యిరుకులోనేపడ్డాను. కట్నం కానుకలు పుచ్చుకుంటే కట్టుకున్న ఆడదానికి, చుట్టుపక్కలవాళ్ళకీ లోకువవుతానని, మాకు బోలెడుంది మేమిస్తాం మొర్రో అన్నా లెట్ పొమ్మన్నాను. పెళ్ళిచూపులనాడే నిర్మలని పక్కకుపిలిచి మొగాడి ఆధిక్యతపట్ల నా అభిప్రాయాన్ని ఆడదాని పెత్తనంపట్ల నా విముఖతని ఖచ్చితంగా చెప్పేసేను. అన్నిటికీ ఒప్పుగొన్న మీదటనే ఆ సంబంధానికి సరేఅన్నాను. కాబోయే మామగారు రిటైర్డ్ ఆర్మీ ఆఫీసర్, క్లబ్‌బర్డ్, నిత్యాగ్నిహోత్రుడు, ఎటొచ్చీ సిగరెట్లుతాదు సిగార్స్ కాలుస్తాడు. రోజూ సాయం సంధ్యలో వేళతప్పకుండా పుణ్యతీర్థం తీసుకుంటూ వుంటాడని వినగానే ఆ యింటి వాతావరణం వాళ్ళ కల్చర్‌కూడా నాకు నచ్చేయి.

పెళ్ళయిన మా మొదటిరాత్రి నేను సిగరెట్ వెలిగిస్తుంటే నాచెయ్యి పట్టుకుని "మీరు సిగరెట్ కాలుస్తారా!" అని అడిగింది, అదేదో ఖూనీ చేసినంత ఘోరమన్నట్టు.

"యస్ డార్లింగ్. మీ నాన్నగారుకూడా కాలుస్తారుగా!" అన్నాను.

"అందుకేనండీ నా భయం. మా నాన్నగారు సిగార్స్ కాలుస్తారు, విస్కీ తాగుతారు, డబ్బెట్టి పేకాడతారు. బోలెడు డబ్బుతగలేస్తారు ఆరోగ్యమూ చెడిపోయింది. ఆమధ్య హార్టటాక్కూడావొచ్చింది. ఎప్పుడూ మా అమ్మకి మా నాన్నగారు గురించే బెంగ. ఆ బెంగతో బ్లడ్‌ప్రెషర్‌కూడా వొచ్చింది" అంది నిర్మల ఆవేదనలో అమాయకంగా కళ్ళ వాల్లా తిప్పుతూ.

"అలాంటి ప్రమాదాలు మనకిరావు అలాంటి ఆలోచనలు పెట్టుకోకు" అన్నాను ధైర్యం చెబుతూ దగ్గిరకి తీసుకుంటూ.

"ఒద్దండీ సిగరెట్ ఏమైనా సువాసనా! ఆరోగ్యమా! బలమా; పైగా నాకాసిగరెట్ పొగ పడదండీ. ఆ కంపు భరించలేను. కడుపులో దేవేస్తుంది సిగరెట్ మానెయ్యండి నాకీ వొక్కవరం ప్రసాదించండి. సిగరెట్

**మా ఆవిడ ఏదో తెలివి తక్కువగా రాసినా మా మామాసురుడింత పట్టేస్తాడనుకోలేదు. అల్లుడు స్వాతంత్ర్యానికి అడ్డుతగుల్తూ ఇలాంటి మామాధములు పరమపదించకుండావుంటే అల్లుడు అల్లరిపాలుకాకుండా వుంటాడా?**

స్మోకింగ్ ఈజ్ ఇన్‌జూరియస్ టు హెల్త్ అని దాని మొహం మీదే రాసుంటుంది కదండీ. మీ ఆరోగ్యమే నా ఆరోగ్యం మన ఆనందం కోసం మన భవిష్యత్తు కోసం-ప్లీజ్" అంటూ నా చేతిలో సిగరెట్ అగ్గిపెట్టె తీసి తన దోసిలిలో పెట్టుకుని చేతులు నా వైపు జాచింది.

నిర్మల మాటల్లో ఉన్న ప్రబోధకంటే ఆమె అభ్యర్థనలో వున్న దైన్యం, అనురాగం నన్ను కరిగించేయి. సిగరెట్ పెట్టె అగ్గిపెట్టె కిటికీలోంచి బయటికి గిరవాటు పెట్టేను. సిగరెట్ మానేసినందుకు ఓ వారం రోజులు పాటు నా ఫ్రెండ్స్ పకపకలు వెళాకోళాలు ఆక్షేపణలు వినలేక తల వొంచుకోక తప్పిందికాదు. సిగరెట్ మానెయ్యడంలో నేను చూపిన నిగ్రహం, మా ఆవిడ పెంకితనానికి తలవొంచి కాకుండా జాలిపడి సిగరెట్ మానెయ్యడం ఒకవరంగా ప్రసాదించడం నాకు సంతృప్తినిచ్చేయి.

ఏదిఏమయినా పెళ్ళినాటి రాత్రి మా ఆవిడ మాటల్ని బట్టిచూస్తే ఒకటి మాత్రం ఖాయం సిగరెట్‌తోబాటు మా ఆవిడకి తాగుడన్నా భయమే. ఫ్రెండ్స్‌తో ఏ పార్టీకైనా వెళ్ళి రెండు పెగ్గులు బిగించి యింటికొచ్చిందాకా వుండి "అయ్యో! నా కా వాసన పడదండి అంటూ మరో వరంకోరి నా ప్రాణాలకో కైకలాగ పరిణమించవచ్చు. అంచేత పెళ్ళినాటి నుంచి ఇంతవరకూ ఏదైనా పార్టీ వుందంటె కేంప్ కెడుతున్నానని చెప్పి రాత్రిఏదో హోటల్లో వుండి మర్నాటి సాయంత్రానికి మళ్ళీ యిల్లు చేరడం అలవాటు చేసుకున్నాను. కాస్త డబ్బు ఖర్చయినా రిస్కులేని వ్యవహారం

ఈ పెళ్ళనే దురవస్థ చట్టబద్ధమైనంత కాలం ప్రతీ మొగాడూ మానసికంగా అర్ధనారీశ్వరుడే అన్న సత్యాన్ని పెళ్ళైన ఏడాదికి గ్రహించేను. ఆడది సంపూర్ణాంగి. అయితే పెళ్ళాడిన మొగాడికి అర్ధాంగి. పెళ్ళికాని క్రితం మొగాడూ పూర్ణాంగుడే. పెళ్ళవ్వగానే సగంచస్తాడు. ఆ చచ్చిన సగాన్ని భర్తీ చేసుకోడానికి ఆడదాన్ని తోడు చేసుకుంటాడు. దానితో ప్రతీ చిన్న విషయంలోనూ పెళ్ళాన్ని గురించి ఆలోచించడానికి పెళ్ళాన్ని సంప్రదించడానికి పెళ్ళాం ఆజ్ఞల్ని శిరసావహించడానికి అలవాటు పడతాడు. ఆడది శక్తిస్వరూపిణి: మొగాడు కేవలం మీసం గెడ్డం స్వరూపుడు.




ఇదంతా ఎందుకు చెబుతున్నానంటే ఇటీవల రెండుమూడుసార్లు మా ఆవిడ "ఏమిటండీ మాటిమాటికీ ఈ అర్ధాంతర ప్రయాణాలు! ఇదేం వుద్యోగమండీ ఎక్కడా కనీవినీ యెరగం! కింద వుద్యోగస్తుల తిండి నిద్రా ఆరోగ్యం గురించి మీ బాస్ పట్టించుకోడా! నాకు తెలియకడుగుతాను. ఈ కేంప్‌లుకి టియ్యేయివ్వరా? కలర్ టివి కొందామంటే ఎప్పుడూ ఈ టూర్ ఖర్చులే లెక్కచెబుతూ వుంటారు!" అంటూ నిలదీసి అడిగింది

"ఇంతవరకూ వొచ్చేక ఇంక దాచడమెందుకూ! నువ్వేడుస్తావో. మొత్తుకుంటావో నీ బాబుతో చెప్పుకుంటావో, ఎందులోనైనా దూకుతావో నీ యిష్టం నేను తాగడానికే కేంప్‌కని చెప్పి వెడుతున్నాను" అందామనుకుని రెండుమూడు సార్లు నోటివరకూ వొచ్చి తమాయించుకున్నాను. నిజానికిందులో ఏం జరిగినా అవమానం నాకే. ఎప్పటికప్పుడు ఏదో అతుకులబొంతలాంటి సమాధానం చెబుతున్నానన్నమాటే కాని మా ఆవిడ

నమ్మిందన్న నమ్మకం నాకు లేదు.

మొన్నీ మధ్య జరగకూడంది జరిగింది. మా డైరెక్టర్ ఓ రోజున పిలిచి "ఏమోయ్! నువ్వు కల్నల్ రంగారావు అల్లుడివా! చెప్పేవు కాదూ మీ ఫాదరిన్లా నాకు బాగా తెలుసు. నీకు కేంప్‌లు ఎక్కువగా వుంటున్నాయనీ, నీ ఆరోగ్యం సరిగ్గా వుండటం లేదనీ రాశాడు. అంత నువ్వెళ్ళవల్సిన కేంప్‌లేముంటాయి. అయినా నేను డిప్యూటీతో మాట్లాడతా వుండు" అంటూ ఎక్కడలేని ప్రేమ ఒలకబోశాడు.

"అబ్బే అదేంలేదండి. ఆయన వట్టి బంగారు మనిషి. దీనికి మీరు డిప్యూటీ డైరెక్టరుతో చెప్పడమెందుకు సార్! మధ్య ఆయన మిస్టేక్ అవుతాడు. నేను మా ఫాదరిన్లాకి రాస్తాలెండి" అన్నాను.

"రాయి రాయి పాపం! ఉన్న ఒక్క కొడుకూ స్టేట్సులో వున్నాడు. ఇక్కడున్న ఒక్క కూతురు మీదా మమకారం అలాగే వుంటుంది. నేనూ రాస్తాన్లే" అన్నాడాయన. నాకు ధైర్యం చెబుతున్నట్టుగా.

మా ఆవిడ ఏదో తెలివి తక్కువగా రాసినా మా మామా సురుడింత పన్జేసాడనుకోలేదు. అల్లుడు స్వాతంత్ర్యానికి అడుతగులూ యిలాంటి మామాధములు పరమపదం చకుండా పదికాలాల పాటుంటే అల్లుడు అల్లరిపాలు కాకుండా వుంటాడా! మొత్తంమీద గట్టిపిండం. వాడు తాగే తాగుడికి ఇంకా లివర్ కేన్సర్ రాకపోడం నా పూర్వజన్మ దుష్కృతం అనుకుంటాను.

నా భావతరంగాల తాకిడి ప్రభావమో, నా వాక్శుద్ధి మహిమో తెలీదు, వారం రోజులతర్వాత మా ఆవిడకొచ్చిన వుత్తరం చూసి నిర్ఘాంతపోయేను. మామగారికి లివర్ కేన్సరని నస్పెక్టు చేస్తున్నారుట. ఆయన సకుటుంబంగా యిక్కడికి వెంచేసి మా గృహం రెండుమూడు రోజులు పావనం చేసి, ఆ తర్వాత మాతోసహా కట్టకట్టుకుని తిరుపతెళ్ళటానికి మొక్కుకున్నాట్ట. నాకు జాలీ వేసింది. వొళ్ళూమండింది. జన్మాంతర పాపాలు రోగాలరూపంలో బాధిస్తాయిట. పాపం! దురదృష్టవంతుడు కేన్సరొచ్చింది. ఆయన చేసిన పాపాలకి తిరపతితో బాటు కాశీ రామేశ్వరాలు వెళ్ళటానికి మొక్కుకున్నా తప్పులేదు. కూతుర్ని కూడా తీసుకెడతానన్నా అభ్యంతరంలేదు. మధ్య ఏ పాపం ఎరగని నేనుకూడా ఎందుకు!

మా అత్తమామలు ఇక్కడ దిగిన మర్నాడు సాయంత్రం నేను ఆఫీసు నుంచి తిరిగి వొచ్చేటప్పటికి హాల్లో కళకళలాడుతూ కొత్త కలర్ టివిసెట్టూ, దానికున్న స్టేండుకి అమర్చిన సొరుగులో వీడియో ఎటాచ్‌మెంటూ ప్రత్యక్షమయ్యేయి.

"నేనే కొందామనుకుంటున్నాను, మీరెందుకండీ కొనడం" అంటూ నసిగేను.

"నువ్వు కొనవని కాదుబాబూ! మాకుమాత్రం ఎవరున్నారు మీరు తప్ప. అందుకే మా సరదాకి కొన్నాం" అంటూ మా అత్తగారంటూంటే నా కళ్ళు చమర్చేయి. మా మావంగారికి చావు ముంచుకొచ్చిందంటే ఆశ్చర్యం లేదు కాని యీవిడికి వైధవ్యమంటే నిజంగా ట్రాజిడియే.

తిరపతిలో కళ్యాణం జరిపించడానికి మంటపంలో కూర్చున్నాం. కొద్ది నిమిషాల్లో ప్రారంభం కాబోతుంది. అంతవరకూ ధ్యానముద్రలో ఉన్న మా మావంగారు నన్ను కాస్త దగ్గిరగా జరగమని సౌంజ్ఞచేసి, జరిగేక, నా చెవిలో "ఆడాళ్ళ ఎదురకుండా చెప్పవల్సిన మాటలు కావు. నేనాట్టేకాలం బతుకుతాననుకోను. మైదేస్ ఆర్ నంబర్డ్. మా మధు స్టేట్స్‌లో స్థిరపడిపోయినట్టే. చూడ్డానికొస్తానన్నాడు కాని వాడు భార్యాబిడ్డల్ని వెంటబెట్టుకు రావడమంటే మాటలా? మమ్మల్నే అక్కడికి రమ్మన్నాడు. తను నాకిక్కడికి రావడానికి అక్కడ ట్రీట్‌మెంట్‌కి అన్ని ఏర్పాట్లు చేస్తానన్నాడు. రానని చెప్పేను. వాళ్ళు రాకపోయినా నాకు ఏచింతా లేదు. నేనేమైపోయినా మా ఆవిణ్ణి ఆ సిపాసుల్నీ చూసుకోడానికి మీరున్నారు. నువ్వూ నిర్మలా చిలకా గోరింకల్లా వుండటం కళ్ళారా చూశాను..." అంటూ ఆయనంటుంటే నాకు మచ్చేమటలూ పోశాయి. "ఏమి పర్వాలేదండి. వెంకటేశ్వర స్వామి దయవల్ల..." అంటూంటే మాటలు తడబడుతున్నాయి.

"నాసంగతి మరిచిపో, మిగతావాళ్ళ సంగతి నువ్వాలోచించు. నువ్వు నాకోమాటివ్వాలి వెంకటేశ్వరస్వామి సమక్షంలో అడుగుతున్నాను... నువ్వు నా కొడుకులాంటివాడివి..." అంటూ ఆయన నా చేతులు పట్టుకుంటే, అసలే ఆయన సింహంలాంటి మనిషేమో, నాకు కళ్ళనీళ్ళ పర్యంతం అయింది.

"వెంకటేశ్వరస్వామి సాక్షిగా ప్రమాణం చేస్తున్నాను. ఏంచెయ్యమంటే అది చేస్తాను. చెప్పండి" అని ఆయన చేతిలో నా చెయ్యి వేశాను, ఆయన కడసారి కోరిక తీరుద్దామని.

"థేంక్స్ నాకానమ్మకముంది నువ్వుమాత్రం, సరదాకైనాసరే ఆల్కహాలిక్ డ్రింక్స్ జోలికి పోవొద్దు. నా జీవితం నేర్పిన పాఠాన్ని నీకు నేర్పుతున్నాను. మిలిటరీ సర్వీస్‌లో చేరేక ఫేషన్ అనీ, ఎటికెట్ అనీ ఫ్రెండ్స్ అనీ, పార్టీలనీ మొదలుపెట్టి..." అంటుంటే నాకళ్ళు బైర్లు కమ్మేయి. ఇంతలోకే కళ్యాణానికి టైమయింది రమ్మన్నారు.

మేము తిరపతినుంచి తిరిగొచ్చేక "మీరెట్టి పరిస్థితుల్లోనూ డ్రింక్స్ ముట్టుకోనని ప్రమాణం చేశారుట. మీరు నిజంగా దేముడండీ. మా నాన్నగారు తాగుతారు, మా చిన్నాన్న తాగుతాడు చివరికి మా అన్నయ్య తాగుతాడు..." అని మాఆవిడో తెమురాలంటూంటే ఇంతలోకే వూళ్ళో కెళ్ళిన మా అత్తమామలు టేక్సీలో తిరిగొచ్చేరు. హాల్లో అడుగెడుతూనే "గుడ్‌న్యూస్‌వోయ్ అంతా ఏడుకొండలవాడిదయ. నాకు లివర్ కేన్సరూ లేదు లంగ్ కేన్సరూ లేదుట. మరో పదేళ్ళ మన హెల్తుకేంటి డోకాలేదని డాక్టర్ ఖచ్చితంగా చెప్పేడు" అంటూ చావుకబురు చల్లగా చెప్పేడు.

❋

గడ్డకట్టలేదు —మల్లిక్

